క్లుప్తంగా

రాణించిన యూపీ బ్యాట్స్‌మెన్


కార్తీకేయ సింగ్, (76 పరుగులు, యూపీ)


బి.యశ్వంత్, (2 వికెట్లు,ఆంధ్ర)

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్ షిప్‌లో కల అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కూచ్ బెహరా ట్రోఫీలో ఉత్తరప్రదేశ్ బ్యాట్స్‌మెన్ రాణించారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూపీ జట్టు 4 వికెట్లు కోల్పోయి 257 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ కార్తీకేయసింగ్ 76 పరుగులు , యేసు ప్రధాన్ 54 పరుగులతో రాణించారు. ఆంధ్ర జట్టు బౌలర్ బి.యశ్వంత్ రెండు వికెట్లు తీసి రాణించాడు.

దంత వైద్య నిపుణుల సదస్సు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న సీకే కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం కట్టుడు దంతాల ప్రత్యేక వైద్య నిపుణుల జాతీయ సదస్సు ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ టి. కృష్ణమోహన్ తెలిపారు. పట్టణంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రోస్తోడాంటిక్ సొసైటీ తరపున సదస్సు ప్రారంభించామన్నారు. సొసైటీ కార్యదర్శి జంగల హరి మాట్లాడుతూ ఈ విభాగ చికిత్సలో తాజా ఆవిష్కరణలు, ఆధునిక పరికరాలు, చికిత్స విధానంపై చర్చ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ భవన్ చంద్, డాక్టర్ మహేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్లు పి శేషారెడ్డి, వై రవిశంకర్, జాకీర్ హుస్సేన్, సాయికుమార్, సందీప్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బతుకు దుర్భరం.. జీవనం భారం

- ఇదీ ఈత చీపుర్ల తయారీవృత్తిదారుల పరిస్థితి
- రోజంతా పనిచేసినా పూటగడవని వైనం
- పథకాలు అందక ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం


చీపుర్ల తయారీకి ఎండబెట్టిన ఈత ఆకులు

ఫిరంగిపురం: రెక్కాడితే డొక్కాడని బతుకులు వారివి. ప్రభుత్వ పథకాలు ఉన్నా.. అవి అందక నిత్యం దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ బతుకులు వెళ్లదీస్తున్నారు. ఫిరంగిపురం మండలంలోని 14 గ్రామాల్లో 2418 మంది వెదురుతో బుట్టలు, గంపలు, ఈత ఆకులతో చీపుర్లు తయారు చేసి విక్రయించి పొట్టపోసుకునే గిరిజనులు ఉన్నారు. అందులో యర్రగుంట్లపాడులో 144 మంది, తక్కెళ్లపాడు 96, శిరంగిపాలెం ఒక్కరు. బేతపూడి నలుగురు, గుండాలపాడు 65, పొనుగుపాడు 116, మేరికపూడి 207, నుదురుపాడు 70, వేమవరం 86, కండ్రిక 19, రేపూడి నలుగురు, అమీనాబాద్, వేములూరిపాడుల్లో 479, ఫిరంగిపురం 1118, హౌస్ గణేష్‌పాడులో 9 మంది ఈ వృత్తి చేస్తున్న వారు ఉన్నారు. కాగా మరో మూడు గ్రామాల్లో నివసించే వారు ఉపాధిలేక ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు.

శ్రమ ఎక్కువ.. ఫలితం తక్కువ

ఈత ఆకులు కోసుకొచ్చి వాటిని చీపుర్లుగా తయారు చేసి గ్రామాల్లో అమ్ముతుండడం వీరి వృత్తి. మరికొందరు వెదురుతో గంపలు, తట్టలు తయారుచేస్తారు. పొలం గట్లమీద ఉన్న చెట్ల నుంచి ఈతాకు కోసేందుకు ఒకరోజు.. మరుసటిరోజు దానిని ఎండబెట్టి, మూడోరోజు దానిని జాగ్రత్తగా ఈతాకు చీపుర్లుగా తయారు చేస్తారు. ఇలా నాలుగు రోజులు శ్రమించి తయారు చేసి అమ్మితేగానీ వారి పళ్లెంలోకి ముద్దరాదు. అయితే ఈతాకు చీపుర్లకు ప్రస్తుతం డిమాండు లేకపోవడంతో కొందరు ఈతాకుతోనే బ్రష్ చీపుర్లు, బూజు దులిపే కర్రలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

వృత్తిని వదిలి కూలి పనులకు..

గ్రామాల్లో చెట్లు తక్కువగా ఉండి ఈతాకు లభించపోవడంతో చాలా కుటుంబాల వారు ఈ వృత్తిని వదిలివేశారు. వ్యవసాయ కూలీలుగా, ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. ఫిరంగిపురం, శిరంగిపాలెం, వేమవరం, వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలవారు దూరప్రాంతాలకు వెళ్లి ఈతాకు సేకరించుకొని వచ్చి చీపుర్లు అల్లుతున్నారు.

అందని ప్రభుత్వ పథకాలు..

ఈ వృత్తుల్లో జీవించే చాలామందికి ప్రభుత్వ పథకాలు అందడంలేదు. కొందరు ఒకచోట నుంచి ఇంకోచోటకు సంచార జీవితం గడుపుతుండడం, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో రేషన్ కార్డులు రాని పరిస్థితి. దీంతో పథకాలకు అర్హత పొందలేక పోతున్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే బ్యాంకు రుణ సదుపాయాలు సైతం వీరివరకు చేరని దుస్థితి ఉంది. కనీస అవసరాలైన విద్యుత్ సదుపాయం కూడా కొందరికి అందని పరిస్థితి. పొద్దుగుంకితే గుడిసెల్లోంచి బయటకు రాలేని దుస్థితి. ఎన్నో ఏళ్లుగా కనీస సదుపాయాలు కూడా లేని దుస్థితిలో ఉన్నా.. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రుణాలు ఇస్తామని చెబుతున్నారని, కానీ ఇచ్చేవారు కరువయ్యారని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని, తమకు రేషన్ కార్డులు, ఇతర మౌలిక సదుపాయాలు అందజేయాలని, తమ పిల్లలకు ఉద్యోగాలు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



చీపుర్లు అల్లి వాటిని అమ్మి జీవిస్తుంటాం. కొన్ని నెలల్లోనే ఈతాకు దొరుకుతుంది. ఒక్కోసారి ఆకు లేకపోవడంతో కూలి పనులకు వెళ్లాల్సివస్తుంది. వచ్చిన కొద్దిపాటి సంపాదనతోనే పిల్లలను చదివించుకుంటున్నాం. చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి. – టి.అలివేలు, ఫిరంగిపురం

రోజంతా పనిచేస్తే కూలిపాటే



పొలాల వెంట వెళ్లి ఈతాకు సేకరించి తెచ్చి రోజంతా పనిచేసినా రూ.200కి మించిరాని పరిస్థితి. వారంలో నాలుగురోజులే పని. పొలం పనులకు వెళ్లాల్సి వస్తుంది. – మేడా ఆదెమ్మ, ఫిరంగపురం

ప్రభుత్వం నుంచి సాయంలేదు..



నాలుగు నెలల కిందట పక్షవాతం వచ్చింది. దీంతో చురుకుగా ఆకు కోసేందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. ఇల్లు కూడాలేక అద్దె ఇంటిలో ఉండాల్సిన పరిస్థితి. ఇద్దరం కలిసి పనిచేస్తేనే రూ.400 వస్తాయి. ప్రభుత్వ సాయం అందించాలి. – కె.సాంబయ్య, ఫిరంగిపురం

రైతు బజారు ధరలు విడుదల

- 'అంతా గ్యాస్ ఏనా' కథనానికి స్పందించిన మార్కెటింగ్ అధికారులు
- అధికారులు చెప్పిన ధరలకు భిన్నంగా బహిరంగ మార్కెట్‌లో ధరలు

తాడేపల్లిరూరల్: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై అంతా 'గ్యాస్'ఏనా..! శీర్షికన 'సాక్షి' మంగళగిరి క్లస్టర్ పేజీలో ప్రచురితమైన కథనంపై బుధవారం గుంటూరు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి సహాయ మార్కెటింగ్ సంచాలకులు బి.రాజబాబు స్పందిస్తూ వివరణ ఇచ్చారు... ఈమేరకు రైతు బజారులో అమ్మకాల గురించి ధరలు విడుదల చేశారు. ఆ ధరల్లో టమాటా ధర కిలో రూ.32 ఉందన్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో టమాటా రకాన్ని బట్టి రూ.60 నుంచి 80 విక్రయిస్తున్న విషయాన్ని మరిచారు. బహిరంగ మార్కెట్‌లో బంగాళదుంపలు 50 నుంచి 80 పలుకుతుండగా..రూ.38 ఆయన అని తెలిపారు. ఉల్లిపాయలు రైతుబజారులో రూ.36 అని తెలిపారు. కానీ బహిరంగ మార్కెట్‌లో రూ.76 నుంచి సైజును బట్టి రూ.100 వరకు అమ్ముతున్నారు. వంకాయ రూ.24 అని తెలిపారు. బయట మార్కెట్‌లో వంకాయ ధర రూ.40 పైనే ఉంది. క్యారెట్ రైతు బజారులో రూ.62 ఉండగా బయట మార్కెట్‌లో రూ.90 ఉంది. పౌరసరఫరాల శాఖ వారి ధరలకు, బయట మార్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉంది. బెండ, కాకర, బీర, దొండ, దోస, సొర, పొట్ల కాయల ధరలు నిలకడగా ఉన్నాయని తెలిపారు. కానీ ఈ కూరగాయలు రూ.40 నుంచి రూ.60 వరకు అమ్ముతున్నారు. రైతుబజారులో బియ్యం కిలో రూ. 47 నుంచి 48 అని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ. 50కు విక్రయిస్తున్నారు. కందిపప్పు కేజీ రూ. 150 అని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.185–190 ఉంది. పామాయిల్ రూ. 110 అని తెలుపగా బయట మార్కెట్‌లో రూ. 135 ఉంది. సన్ ఫ్లవర్ ఆయిల్ కిలో 124 అని తెలుపగా, బహిరంగ మార్కెట్‌లో రూ. 150 నుంచి 160వ వరకు ఉంది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ విడుదల చేసిన ధరలకు, రైతు బజార్ ధరలకు, బహిరంగ మార్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉంది.

ఏసీసీ కార్మికుల అర్ధనగ్న నిరసన


నిరసన తెలుపుతున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లి రూరల్: బకాయిలను చెల్లించాలని కోరుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఫ్యాక్టరీ ప్రాంతంలో బుధవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికులకు అన్ని కార్మిక సంఘాలు, రాజకీయాలకు అతీతంగా మద్దతు వస్తోందని అన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కె. ఆదినారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కె. స్టీవెన్, ఆశీర్వాదం, బి.అంకయ్య, సూర్య ప్రకాష్, వై. సుబ్బారావు, సాంబయ్య, నాగేశ్వరరావు, దానయ్య, కె. దుర్గారావు, ఎస్‌కే జానీ, రమాదేవి, దుర్గా భవాని, సామ్రాజ్యం, శారద, నవనీతం, నరసింహారావు, దుర్గమ్మ, కృష్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేద్దాం

తాడికొండ మండల నాయకుల సమావేశంలో సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు


కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వనమా బాలవజ్రబాబు

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేదానిపై దృష్టిసారించి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) అన్నారు. బుధవారం గుంటూరులోని తన కార్యాలయంలో తాడికొండ మండల నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కావాల్సిన సలహాలు, సూచనలు స్వీకరించి అందరికి ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈనెల 30వ తేదీ లోగా పార్టీ గ్రామ కమిటీలు పూర్తి చేసి మండల అధ్యక్షుడి ఎంపికలు అందరి ఆమోదం మేరకు నియమించనున్నట్లు తెలిపారు. విభేదాలు ఉంటే తనతో నేరుగా చర్చించాలి, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ ముందుకు వెళ్లవద్దని సూచించారు. అందరితో చర్చించి తెలుగుదేశం పార్టీ అరాచకాలకు ఇబ్బందులు పడిన కార్యకర్తలకు మనో ధైర్యాన్ని కల్పించేలా ముందుకు వెళతామన్నారు. 2027లో జరిగే జమిలి ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటే క్రమ పద్ధతిలో అందరూ నడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో 5.30 కోట్ల మంది ప్రజలకు రూ. 2.85 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఒక్క రూపాయి అవినీతి లేకుండా మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ ద్వారా ప్రజలకు అందిస్తే, సూపర్ 6 పథకాలను ఇస్తానని చెప్పిన సీఎం చంద్రబాబు ఐదు నెలల్లో ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోవడం ఆయన చేతగానితనానికి నిదర్శనం అన్నారు. పార్టీ తాడికొండ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు బిక్కి శివ రామకృష్ణ, ముప్పాళ్ల మనోహర్, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సీనియర్ నాయకులు మల్లంపాటి రాఘవ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి

మేడికొండూరు: మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు యువత సహకారం అవసరమని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎం.రవికుమార్ రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖా నెహ్రూ యువ కేంద్రం గుంటూరు సౌజన్యంతో పేస్ సొసైటీ ఆధ్వర్యంలో డ్రగ్ ప్రివెన్షన్ పై కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ స్థానిక యూనివర్సల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బుధవారం నిర్వహించారు. కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల దుష్పరిణామాలు కలుగుతాయన్నారు. జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వి.అరుణ కుమారి మాట్లాడుతూ యువత దైనందిన జీవితంలో మంచి అలవాట్లు పాటించాలన్నారు. డ్రగ్స్ కి దూరం ఉండాలని సూచించారు. ఎం.యశోధర రాణి, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, పీఆర్కే మూర్తి, మాధవి, ఎక్సైజ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.రమేష్, యూనివర్సల్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల దినోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేటలోని శ్రీరామ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలోని విద్యార్థులకు 'మత్తు వదిలితేనే భవిష్యత్తు' అనే అంశంపై బుధవారం వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ బి. రమేష్ మాట్లాడుతూ ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 20న జరుపుకొంటారని, బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, బాలలు తమ భావాలను పంచుకోవడానికి, పరస్పర అవగాహనను పెంచుకోవడానికి ఈ దినోత్సవం నిర్వహిస్తారన్నారు. బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కులు ఉన్నాయన్నారు. అనంతరం వక్తృత్వ పోటీలు నిర్వహించగా మొదటి బహుమతిని బి. అఖిల్, రెండవ బహుమతిని డి. హర్షిక దేవి, మూడవ బహుమతిని డి. జయంత్‌లు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మెట్రిక్యులేషన్ స్కూల్ హెచ్‌ఎం ఎస్.షారోన్ సుమలత విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు జి.దుర్గ, వి.సుజాత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం వెంకటరెడ్డి జిల్లా ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మై చాయిస్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ కో–ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ షేక్ బాజీలు మాట్లాడారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి.స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సుబ్బారావు మృతి

తాడికొండ: బనవోలు గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం నాయకుడు పాలకాయల సుబ్బారావు (91) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయనకు ఇరువురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారావు సీపీఎం నాయకుడిగా, రైతు సంఘం నాయకుడిగా మంగళగిరి డివిజన్‌లో పనిచేశారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.చెంగయ్య, సీపీఎం నాయకులు సుబ్బారావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రాతూరు– చిర్రావూరు మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై తాడేపల్లి ఎస్ఐ జె. శ్రీనివాసరావు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ పూర్ణానందపేటకు చెందిన ఎస్‌కే ఖాదర్ బాషా (53) మంగళగిరి రూరల్ నూతక్కిలో కిళ్లీకొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి తన ద్విచక్ర వాహనంపై నూతక్కి నుంచి రామచంద్రాపురం మీదుగా కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంబడి వస్తుండగా మార్గమధ్యంలో చిర్రావూరు ప్రాతూరు మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి బంధువుల సహాయంతో మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. జరిగిన సంఘటనపై ఖాదర్ బాషా కుమార్తె అష్మామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జె. శ్రీనివాసరావు తెలిపారు.

24న మండల స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మేడికొండూరు: మేడికొండూరు మండల స్థాయి ఫుట్‌బాల్ లీగ్, బాల, బాలికల విభాగంలో అండర్ 14, 17 విభాగాల టోర్నమెంట్ ఈనెల 24న పేరేచర్ల, ఎస్‌జీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయని మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, సెక్రటరీ మానుకొండ బ్రహ్మాజీ బుధవారం తెలిపారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రతి శని, ఆదివారాల్లో మండలంలోని వివిధ పాఠశాల మైదానంలో డిసెంబర్ 31 వరకు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9347023690 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీపీటీ-2858 విత్తనాలు భేష్

దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి.శిరీష

తాడేపల్లిరూరల్: బీపీటీ– 2858 మినీకిట్ విత్తనాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని దుగ్గిరాల వ్యవసాయ అధికారి పి.శిరీష అన్నారు. బుధవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఏరువాక కేంద్రం, గుంటూరు శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, ఎం.వెంకటరాములు దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి.శిరీష దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రులో జంధ్యాల వెంకటేష్ పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ గతంలో జంధ్యాల వెంకటేష్‌కు బీపీటీ–2858 మినికిట్‌ను అందజేశామని, ఈ రకాన్ని ఆయన జూలై 30వ తేదీన మెట్టదుక్కిలో విత్తారని, ఈ మినీకిట్ రకం దుబ్బుకి సుమారు 40–45 పిలకలు చేయగా, ఈపిలకలకు 25–30 వరకు కంకులు వచ్చాయని, ఈ మినీకిట్ వరికి అగ్గి తెగులు మరియు బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఆశించలేదని, ఇంకో 15 రోజుల్లో ఈ మినికిట్ పైరు కోతకు వస్తుందని తెలిపారు. బిపిటి–5204కి సమానంగా వచ్చే విధంగా ఉందని రైతు వెంకటేష్ పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఈఓ ఎ.రమేష్, వీపీఏ సిహెచ్ పవన్ కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో బుధవారం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్‌బాబు, రిటైర్డ్ హెచ్‌ఎంలు కె.పోతురాజు, కె.శౌరి ఫ్రాన్సిస్, దీవి కృష్ణమూర్తి, సైదాసాహెబ్ పాల్గొన్నారు.


మంగళగిరి: గ్రంథాలయాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని గ్రంథాలయ అధికారులు, అతిథులు తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నగర పరిధిలోని నూతక్కి శాఖ గ్రంథాలయంతో పాటు మంగళగిరి శాఖా గ్రంథాలయంలో ముగింపు సభ జరిగింది. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాలలో జొన్నల శివరారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాస్టర్ వీవర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారి ఎస్.ఆరోగ్యం పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: వారంలో ఒక్క రోజైనా గ్రంథాలయానికి వచ్చి విద్యార్థులు తమకు నచ్చిన పుస్తకాలను చదవాలని తాడేపల్లి మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఈఓ నాగేశ్వరరావును ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు రాంబాబు, రమేష్, సాయి వైష్ణవి, షేక్ షకీల పర్వీన్, గ్రంథాలయ అధికారి నాగుర్‌బాషా పాల్గొన్నారు.

తాడికొండ: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని గత వారం రోజులుగా కొనసాగుతున్న వివిధ రకాల పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈసందర్భంగా తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో చిత్రలేఖనం, నృత్యాలు, ఉపన్యాసం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. తుళ్లూరు గ్రంథాలయ అధికారి టి.గిరిధర్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మేడికొండూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. గ్రంథాలయ అధికారి సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడికొండూరు గ్రామ సర్పంచ్ పూల నాగమణి, గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేష్ హాజరయ్యారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

మాల సంక్షేమ ఆర్థిక సంఘం చైర్మన్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకారం



తాడేపల్లిరూరల్: మాల సంక్షేమ సహకార ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా డాక్టర్ పెద్దపూడి విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్‌లో గల మాల సంక్షేమ సహకార ఆర్థిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.